క్లుప్తంగా

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ సీజ్



ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసిన అధికారులు

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరులో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని గురువారం టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గ్రామం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారిని సీజ్ చేసి, పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు టాస్క్ ఫోర్స్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఇదిలా ఉంటే రెండు రోజుల క్రితం ఔరంగాబాద్, వాడపల్లి ఇసుక ర్యాంపుల్లో మైనింగ్ టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీ చేసి నాలుగు లారీలను సీజ్ చేశారు. బిల్లులు లేకుండా, అధిక లోడ్‌తో వెళుతున్న వాటిపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

బిల్లు లేని ఇసుక లారీపై కేసు



గజ్జరం వద్ద అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీ

తాళ్లపూడి: ఇసుకు ర్యాంపుల నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమ రవాణా చేస్తున్న లారీని గురువారం స్వాధీనం చేసుకున్నట్టు టాస్క్ ఫోర్స్ ఏఎస్సై జి.గంగాధర్ తెలిపారు. టాస్క్ ఫోర్స్ అధికారుల దాడుల్లో తాళ్లపూడి మండలం గజ్జారం చింత నుంచి బిల్లు లేకుండా 10 టన్నులు లోడుతో గోపాలపురం వెళుతున్న ఇసుక లారీని గుర్తించి, దానిపై కేసు నమోదు చేశామన్నారు. తాళ్లపూడి పోలీస్‌స్టేషన్‌కి అప్పగించామని, మైన్స్ అధికారులు విచారణ జరిపి జరిమాన విధిస్తారని తెలిపారు.

ఇసుక మేటల తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ



ప్రక్కిలంలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణిసుస్మిత

తాళ్లపూడి: ప్రక్కిలంక పంచాయతీ కార్యాలయం వద్ద లంక భూముల్లోని(అఖండ గోదావరి ఎడమ ఒడ్డు) ఇసుక తొలగించేందుకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అధ్యక్షతన నిర్వహించారు. పట్టా భూముల్లో 6.55 హెక్టార్లలో ఇసుక మేటలు(డీసిల్ట్) తవ్వకాలకు అనుమతులు ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కాకినాడ వారి ఆధ్వర్యంలో జరిగిన అభిప్రాయ సేకరణలో పలువురు తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్‌రావు, మైనింశాఖ ఏడీ ఫణిభూషన్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి లావణ్య, ఆర్ఐ కె.రామకృష్ణ, వీఆర్వో విజయ కుమారి తదితతరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రేషన్ సరకులు పంపిణీ

గ్రామంలోని వృద్ధులకు ఇంటి వద్దే రేషన్‌సరకులను ఆర్డీవో రాణి సుస్మిత చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఐదు రోజులు ముందుగానే వీటిని అందజేస్తున్నామన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నిడదవోలు రూరల్: తాడిమళ్ల కాటకోటేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తాడిమళ్ల, సూరాపురం గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, త్రీఫేస్ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆపన్నహస్తం లేక..

- గ్రంథాలయ పన్నుల చెల్లింపులో నిర్లక్ష్యం
- ప్రభుత్వ సంస్థల నుంచి రూ.లక్షల్లో బకాయిలు
- అభివృద్ధికి నోచుకోని విజ్ఞాన భాండాగారాలు



ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో మరుగుదొడ్డి వద్ద దిగబడిపోయిన ఫ్లోరింగ్

ఉండ్రాజవరం: ప్రజలు పన్నులు చెల్లిస్తున్నా ఆ పన్నుల్లో గ్రంథాలయాల వాటా జమ చేయడంలో ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. దీంతో నిరుద్యోగ యువతీ, యువకులకు అండగా నిలిచే విజ్ఞాన భాండాగారాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. గ్రామ పంచాయతీలు వసూలు చేసే పన్నుల్లో 8 శాతం గ్రంథాలయాల వాటాగా జమ చేయాలి. ఈ నిధులు ఎప్పటికప్పుడు చెల్లించాల్సి ఉన్నా అలా జరగడం లేదు. దీంతో ఏళ్లుగా మండలంలో అయితే లక్షలు, నియోజకవర్గ స్థాయిలో అయితే రూ.కోట్లలలో బకాయిలు పేరుకుపోయాయి.

నిధులు లేక..

గ్రంథాలయాలకు స్థానిక సంస్థల నుంచి పన్నుల (సెస్) రూపంలో నిధులు సమకూరుతాయి. ఆనిధులు చెల్లింపులు లేకపోవడంలో మండలంలోని ఉండ్రాజవరం శాఖ గ్రంథాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. గ్రంథాలయం లోపల ఫోర్లింగ్ దిగిపోవడంతో ఫ్లోరింగ్‌పై వేసిన టైల్స్ కూడా దిగిపోవడంతో వాటిపై నడుస్తున్న పాఠకులు జారీ పోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఏనిమిది ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. మూడు దశాబ్దాల క్రిందట స్థానిక విద్యార్థులు, ఉపాధ్యాయులు నాటకాలు ప్రదర్శించడం ద్వారా వచ్చిన సొమ్ముతో కచేరి చావిడి సమీపంలో ఏర్పాటు చేశారు. అనంతరం 2008 సంవత్సరంలో పంచాయతీ స్థలం కేటాయించడంతో ప్రభుత్వం నిధులు, దాతల సహకారంతో పక్కా భవనం నిర్మించారు. కొన్నాళ్లకు గ్రంథాలయం లోపలి ఫ్లోరింగ్ సుమారు అడుగు లోతుకు కుంగిపోయింది. దాంతో వేసిన టైల్స్ పగిలిపోయాయి. ముక్కలైన టైల్స్ పెంకులు తగిలి గాయాలవుతున్నాయి. అలాగే మరుగుదొడ్డి వద్ద ఫ్లోరింగ్ దెబ్బతింది. గోడలు బీటలు వారాయి. మండలంలో 15 గ్రామాలకు గాను ఉండ్రాజవరం శాఖ గ్రంథాలయమే ప్రధానం. పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాలు, కంప్యూటర్, ఇంటర్‌నెట్ అందుబాటులో ఉన్నాయి. వేసవి కాలంలో విద్యార్థులు ఎక్కువ మంది ఈగ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటారు. భవనం దుస్థితిపై పలుమార్లు స్థానికులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దాంతోపాటు ఈగ్రంథాలయానికి గ్రంథపాలకుడు లేక, ఇన్‌చార్జి పర్యవేక్షణలో నడుస్తోంది. దాంతో పాఠకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఈగ్రంథాలయానికి లైబ్రేరియన్‌ను నియమించాలని పాఠకులు కోరుతున్నారు. ఇన్‌చార్జి గ్రంథపాలకుడు గుత్తికోండ కృష్ణారావు మాట్లాడుతూ భవనాన్ని అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు.



ఉండ్రాజవరం శాఖ గ్రంథాలయంలో పగుళ్లు తీసిన ఫ్లోరింగ్

వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శుల నియామకం



నరహరిశెట్టి రాజేంద్రబాబు



గడా రాంబాబు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగంలో దేవరపల్లి మండలానికి చెందిన ఇద్దరు సీనియర్ నాయకులకు స్థానం లభించింది. యర్నగూడేనికి చెందిన నరహరిశెట్టి రాజేంద్ర బాబు రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా, చిన్నాయగూడేనికి చెందిన గడా రాంబాబు రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నరహరిశెట్టి రాజేంద్రబాబు గ్రామ సర్పంచ్‌గా, గోపాలపురం ఏఎంసీ చైర్మన్‌గా, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్‌గా పనిచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. గడా రాంబాబు గతంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా పనిచేశారు. గ్రామంలో అనేక సేవా, పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ కార్యకర్తలకు అండగా ఉంటున్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర బాబు, రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళతామన్నారు. ప్రధానంగా పొగాకు, కోకో, మిర్చి, ధాన్యం పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయినట్టు వారు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రైతుల సమస్యలపై పోరాటం చేస్తామని వివరించారు. తమపై నమ్మకంతో రాష్ట్ర స్థాయిలో స్థానం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ హోం మంత్రి, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు తానేటి వనిత, పార్టీ జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు.

పాస్టర్ మృతికి మాజీ మంత్రి వనిత సంతాపం



గోపాలపురంలో పాస్టర్ గాబ్రియేలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వనిత

గోపాలపురం: పాస్టర్ తిగిరిపల్లి గాబ్రియేలు అకాల మృతి కుటుంబ సభ్యులకు, దైవజనులకు తీరని లోటని రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు డాక్టర్ తానేటి వనిత అన్నారు. బేతేలు ప్రార్థనా మందిరం పాస్టర్ గాబ్రియేలు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను గురువారం పార్టీ నాయకులతో కలిసి వనిత పరామర్శించారు. ఉప్పరగూడెం, పెద్దగూడెం గ్రామాల్లో చర్చిలు ఏర్పాటు చేసి గాబ్రియేలు దైవ సేవలను అందించారని కొనియాడారు. అనంతరం ఇటీవల పెద్దగూడెంలో మృతిచెందిన కొరపాటి శ్వేత, అక్కాబత్తుల దేవి కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఆమె వెంట ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, నాయకులు వెలగా శ్రీరామమూర్తి, కూసం రామమోహన్‌రెడ్డి, ఎస్‌కే వలీ, సాలి వేణు, కాకులపాటి శ్రీను, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, ముచ్చికర్ల రవి, పిన్నమనేని చినబాబు, దుగ్గిరాల రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కొవ్వూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- నేడు కాతేరులో పార్టీ జిల్లా విస్తృత సమావేశం



పెద్దేవంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కొవ్వూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. మండలంలోని పెద్దేవంలో గురువారం నాయకులు, కార్యకకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కాతేరులోని గామన్‌బ్రిడ్జి సమీపంలోని వేంకటాద్రి గార్డెన్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోర్డినేటర్ బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, నియోజక వర్గాల ఇన్‌చార్జ్‌లు హాజరువుతున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

బాబూ ఎప్పుడిస్తావ్‌పై ప్రజల్లోకి..

ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను ఏడాది పూర్తయిన అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందుకు గాను పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బాబు ఎప్పుడి స్తావ్ కార్యక్రమం ప్రజల్లోకి తీసుకుని వెళ్లనున్నట్టు తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరించాలని చెప్పారు. నిరంతరం ఆందోళన చేయడం, ప్రశ్నించడం వల్లే చంద్రబాబు తల్లికి వందనం అ పథకం అమలు చేశారని, లేదంటే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసేవారని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్, మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు నాయకులు గూడా విజయరాజు, పిట్టా శ్రీనివాస్, యాళ్ల బాబూరావు, వల్లభశెట్టి చిన్ని, తిగిరిపల్లి వెంకట్రావు, గండి రాంబాబు, ఉప్పులూరి సూరిబాబు, బట్టు సుబ్బా రావు, వి.నంద, ఇంటి వీర్రాజు, కొయ్య దుర్గారావు, చిక్కాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు తలారి పరామర్శ



పెద్దేవంలో గారయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మోషేను రాజు, తదితరులు



పెద్దేవంలో గారయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న తలారి వెంకట్రావు, తదితరులు

తాళ్లపూడి: పెద్దేవం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కవల నాగేశ్వరరావు తండ్రి కవల గారయ్య ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన సంతప సభకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, నియోజక వర్గ వైఎస్సార్ సీపీ కోర్డినేటర్ తలారి వెంకట్రావు తదితరులు హాజరై కుటుంబానికి సంతాపం తెలియ జేశారు. కవల గారయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జిల్లాయువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్, మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాయకులు గూడా విజయరాజు, పిట్టా శ్రీనివాస్, యాళ్ల బాబూరావు, తిగిరిపల్లి వెంకట్రావు, గండి రాంబాబు, బట్టు సుబ్బారావు, వి.నంద, ఇంటి వీర్రాజు, కోయ్య దుర్గారావు, కోటూరు సత్యనారాయణ, అందుగుల రవి, చిక్కాల మహేష్, బొంత శ్యామ్ తదితరులున్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- ఆర్డీవో రాణి సుస్మిత
- కళాశాలల్లో అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం



సమిశ్రగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు, విద్యార్థులు

తాళ్లపూడి(కొవ్వూరు): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరులో పలు విద్యా సంస్థల్లో గురువారం అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. కొవ్వూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వాటి నివారణపై అవగాహన కల్పించారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ విద్యార్థులు, యువత మద్యం, మత్తు పదార్థాల జోలికి వెళ్ల వద్దని తమ జీవితాలను పాడు చేసుకోవద్దుఅన్నారు. భవిష్యత్‌పై దృష్టి పెట్టాలన్నా రు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, తహసీల్దార్ దుర్గాప్రసాద్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాలలో...

న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కొవ్వూరు వారి ఆధ్వర్యంలో కొవ్వూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.నాగమణి మాట్లాడుతూ యువత డ్రగ్స్ వంటి దురలవాట్లకులోను కావొద్దని డ్రగ్స్ తీసుకుంటే జీవితాలు నాశనమవుతాయని డ్రగ్స్ కేసులో అరెస్టు అయినట్లయితే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు వై ప్రకాశరావు , పి.వి.పి.లక్ష్మి శ్రీవల్లీ, పి.హ రీష్, టి.తారాకుమారి, రఘురాం పాల్గొన్నారు. స్థానిక ఏబీఎన్ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో ..

నిడదవోలు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీయస్)ఆధ్వర్యంలో పట్టణంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం, మాదక ద్రవ్యాల నుండి యువతను కాపాడుకుందాం, డ్రగ్స్ రహిత సమాజంకోసం కృషి చేద్దాం అంటూ ప్రమాణం చేయించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. యు. బాలరాజు, ఎం.ప్రసాద్, దీపు, టి.రాజు, పోసి, నాగయ్య చంద్రరావు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులోని డిగ్రీ కళాశాలలో జరిగిన సదస్సుల్లో మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుస్మిత

నిడదవోలు రూరల్: సమాజంలో యువత మాదక ద్రవ్యాలకు బానిస అవుతోందని, వీటికి దూరం కాకపోతే భవిష్యత్తును కోల్పోతారని నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్.జయరాం సతీష్ అన్నారు. సమిశ్రగూడెం వికాస్ జూనియర్, డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనకు ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్స్ గురించి వివరించారు. డ్రగ్స్ కొనుగోలు, రవాణాపై కఠిన చట్టాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు రామారావు, సుధీర్, నాగేశ్వరరావు, అధ్యాపకులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి

నిడదవోలు: డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ లక్ష్మీ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వినియోగం–అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ అందమైన భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూపర్‌వైజర్ సీహెచ్ లక్ష్మీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వారాహీ గుప్త నవరాత్రులు ప్రారంభం



విశేష అలంకరణలో వారాహీ అమ్మవారు



కడియంలో వారాహీదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

సీటీఆర్ఐ: గాడాల గ్రామంలోని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో గురువారం వారాహీ అమ్మవారి గుప్త నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి దర్శనానికి రాజమహేంద్రవరం చుట్టు పక్కల నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు మాట్లాడుతూ మహాలక్ష్మీ అమ్మవారు వారాహీదేవిగా జూలై 10వ తేదీ ఉదయం 9 గంటల వరకూ దర్శనమిస్తారన్నారు. ఈ గుప్త నవరాత్రుల్లో ప్రతిరోజు విశిష్ట పూజలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. పీఠంలో వారాహీ రక్ష తయారు చేస్తున్నామన్నారు. జూలై 10వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 108 కేజీల గంధంతో మహాభిషేకమాచరించి అమ్మవారి రక్ష ప్రసాదంగా భక్తులకు అందజేస్తామని తెలిపారు.

వారాహీ నవరాత్రులు ప్రారంభం

కడియం: మండల కేంద్రమైన కడియంలోని భ్రమరాంబిక మల్లేశ్వరస్వామి ఆలయంలో వారాహీదేవి నవరాత్రులను గురువారం ప్రారంభించారు. ఆలయ అర్చకుడు అప్పలి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆకుల వీర్రాజుకు పరామర్శ

ఆల్మాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజును గురువారం రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యో మోషేన్‌రాజు పరామర్శించారు. ఇటీవల వీర్రాజు మాతృమూర్తి ఈశ్వరమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె చిత్రపటానికి మోషేన్ రాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆకుల వీర్రాజు, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రముఖ వైద్యుడు పంతం అచ్యుత రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కానుబోయిన సాగర్, యామన రామకృష్ణ గౌడ్, అల్లాడ కృపరాజబాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మైనార్టీల సమస్యలపై దృష్టి సారించాలి

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వంలో మైనార్టీలకు జరుగుతున్న అన్యాయాలు, సమస్యలపై దృష్టి సారించి, వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మీర్జా మౌలా అలీకి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సూచించారు. బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం మాజీ మంత్రిని ఎంఎం అలీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, మాజీ ఉప సర్పంచ్ చెరుకూరి సత్యనారాయణ, మైనార్టీ నాయకులు ఇబ్రహీం, షట్టర్ బాషా, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీగా నియమితులైన అంగాడి సత్యప్రియ గురువారం బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణను మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనను మహిళా విభాగం జనరల్ సెక్రటరీగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై దృష్టి సారించి, వారికి న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి వేణుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అలీ



మాజీ మంత్రి వేణును మర్యాదపూర్వకంగా కలిసిన సత్యప్రియ

కోర్టు కేసుల పరిష్కారంపై దృష్టి

రాజమహేంద్రవరం సిటీ: కోర్టు కేసులపై అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో కౌంటర్ ఫైళ్లు, అప్పీలు దాఖలు చేయాలని అడిషినల్ కమిషనర్, లైజనింగ్ ఆఫీసర్ పీవీ రామలింగేశ్వర్ అన్ని విభాగాల హెచ్‌ఓడీలను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం ప్రిన్సిపల్ సెక్రటరీతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌తో అడిషినల్ కమిషనర్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. అనంతరం అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ కోర్టు కేసులకు సంబంధించి అధికారులు వెంటనే స్పందించాలని సూచించారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి కేసులు అత్యధికంగా పెండింగ్‌లో ఉన్నాయని, కనుక అధికారులు వారి పరిధిలోని కేసుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కేసుల మానిటరింగ్ కోసం ప్రతి విభాగంలోనూ సూపరింటెండెంట్, క్లర్క్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇకపై ప్రతి గురువారం సమీక్ష జరుగుతుందని, వచ్చే సమావేశానికి శాఖల వారీగా ప్రోగ్రెస్ చూపాలని ఆదేశించారు.